క్లుప్తంగా

మహానందిలో భక్తుల సందడి



రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. భక్తులు ముందుగా రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమితానందం పొందుతూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కొనసాగగా రాత్రి ఏకాంతసేవ పూజల వరకు భక్తుల రద్దీ ఏ మాత్రం తగ్గలేదు.

ఉద్యాన పంటలను ప్రోత్సహించండి



మాట్లాడుతున్న ఏపీఓ రేష్మ

కొత్తపల్లి: రైతులను ఉద్యాన పంటల సాగువైపు మళ్లించాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి 2024–25 సంవత్సరానికి హార్టికల్చర్ కింద సాగుచేసేందుకు 300 ఎకరాలు కేటాయించిందన్నారు. ఈ టార్గెట్‌ను వారంలోపు పూర్తి ఎస్టీమేషన్ వేసి రైతుల వివరాలను పొందుపర్చాలని సూచించారు. అదేవిధంగా విధంగా వేతనదారులను అధిక సంఖ్యలో పనులకు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ గ్రామంలో వేతనదారులు పనికావాలన్నా వెంటనే చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



ఆలయంలో ఏపీ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్, కుటుంబ సభ్యులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ పి.వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి నంద్యాల జిల్లా అగ్నిమాపకాధికారి యోగేశ్వర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అలంకార మండపంలో వారికి స్వామి ,అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు.

పడమర ప్రాతకోటలో పికెట్



పడమర ప్రాతకోటలో సీఆర్‌పీఎఫ్ బలగాల పికెట్

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోటలో పోలీస్ పికెట్ కొనసాగుతోందని ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ మంగళవారం తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో పికెటింగ్ కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఎవరైన గ్రామాల్లో రెచ్చగొట్టే వాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తుల గౌరవాన్ని కించపరిచేలా పోస్టింగ్‌లు పెట్టినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదే పదే అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నించే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, చట్టవ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించమని.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు.

సాక్షిగణపతికి విశేష పూజలు



శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రానికి 2 కి.మీ దూరంలో ఉన్న సాక్షి గణపతికి బుధవారం సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. జలాభిషేకం, పంచామృతాభిషేకం, షోడషోపచార పూజలతో అభిషేకించి ఉండ్రాళ్లను, రవ్వ లడ్లను నైవేద్యంగా సమర్పించారు.

వర్షపు చుక్క.. తప్పుతున్న లెక్క

- నిరుపయోగంగా వర్షపాత నమోదు కేంద్రాలు
- తహసీల్దారు కార్యాలయంపైనే ఆధారపడిన వివిధ శాఖలు
- కరువు మండలంగా గుర్తింపునకు నోచుకోని వైనం
- ఏటా నష్టపోతున్న రైతన్నలు

జూపాడుబంగ్లా: ఏటా కురుస్తున్న వర్షపుచుక్కల లెక్కలు తప్పుతుండటంతో మండలంలో ప్రతి ఏటా పంటనష్టం వాటిల్లుతున్నా కరువు మండలంగా గుర్తింపునకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసే వర్షానికి లెక్కలు కట్టేందుకుగాను పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జూపాడుబంగ్లా విద్యుత్ ఉపకేంద్రం, తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రం, జూపాడుబంగ్లా తహసీల్దారు కార్యాలయాల వద్ద 25 ఏళ్ల క్రితం వర్షపాత నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా కేంద్రాలను ఆధునీకీకరించకపోవడంతో పాత పద్ధతుల్లోనే వర్షపు చుక్కలను లెక్కిస్తున్నారు. దీనికి తోడు తంగడంచ ఫారం, జూపాడుబంగ్లా విద్యుత్తు ఉపకేంద్రం, పారుమంచాల ఆరోగ్యకేంద్రం లో ఉన్న వర్షపాత నమోదు కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో మండలంలో ఎక్కడ వర్షం కురిసినా జూపాడుబంగ్లా తహసీల్దారు కార్యాలయంలో వర్షపాతం నమోదు లెక్కలపైనే అన్నిశాఖల అధికారులు ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది.

పాతపద్ధతుల్లోనే వర్షం లెక్కింపు

ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేటితరుణంలో కూడా పాతపద్ధతుల్లోనే వర్షపాతాన్ని లెక్కిస్తున్నారు. 25 ఏళ్ల క్రితం భూమిలో అమర్చిన ఓ పాతతుప్పుపట్టిన గొట్టంలో ఓ డబ్బాను ఏర్పాటుచేసి అందులో పడిన వర్షపు నీటిని బీకరులో పోసి లెక్కించటం జరుగుతోంది. పొరపాటున వర్షపునీటి డబ్బాజారి కిందపడి నీళ్లు ఒలికిపోతే రెవెన్యూ సిబ్బంది చూచాయంగా చెప్పిన లెక్కలే శరణ్యం అవుతున్నాయి. వాటినే అధికారులు పరిగణలోకి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



తంగడంచ ఫారంలో నిరుపయోగంగా మారిన వర్షపాత నమోదు కేంద్రం

కొన్ని గ్రామాల్లో వర్షం కురిసినా లెక్కలు నిల్

ఓ గ్రామంలో వర్షం కురిసి మరో గ్రామంలో కురవని పరిస్థితులున్నాయి. మండలంలోని పారుమంచాల, తూడిచెర్ల ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసినా ఆయా ప్రాంతాల్లో వర్షపాత లెక్కింపు కేంద్రాలు పనిచేయకపోవడంతో అక్కడి వర్షపాతాన్ని లెక్కించలేకపోతున్నారు. అక్కడ వర్షం కురిసినా, కురవకపోయినా వర్షపాత నమోదు లెక్కలు నిల్‌గానే ఉంటున్నాయి. తహసీల్దార్ కార్యాలయం లెక్కలే ప్రామాణికంగా తీసుకోవడం వల్ల ఒక గ్రామంలో వర్షం కురిసి, మరో గ్రామంలో కురవకపోయినా వర్షం పడినట్లుగానే పరిగణిస్తున్నారు. ఇలా చేయటం వల్ల వర్షం కురవని గ్రామాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఏటా పంటనష్టం వాటిల్లినా..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుడటంతో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. అనంతరం వర్షాలు కురవక రైతులు సాగుచేసిన పంటలు నష్టపోతున్నారు. అయినా అధికారులు జూపాడుబంగ్లా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకుండా చేతులెత్తేయడం పరిపాటిగా మారిందని రైతులు వాపోతున్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకొని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రామాల్లోని పాత వర్షపు నమోదు కేంద్రాలను ఆధునీకీకరించి ప్రతి గ్రామంలో కురిసే వర్షపాతాన్ని గణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు పేర్కొంటున్నారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న వర్షపాత నమోదు పరికరం



లెక్కింపు కోసం నీటిని ఒడిసిపట్టే డబ్బా



తంగడంచ చెక్‌పోస్టు వద్ద నిరుపయోగంగా మారిన ఆటోమేటిక్ వాతావరణ కేంద్రం

నిరుపయోగంగా మారిన వాతావరణ గణాంక పరికరాలు

తంగడంచ చెక్‌పోస్టు, పారుమంచాల విద్యుత్ ఉపకేంద్రం, రామసముద్రం అంచెవద్ద ఏర్పాటు చేసిన స్వయం నియంత్రణ (ఆటోమెటిక్) వాతావరణ నమోదు కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. 15 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఈ కేంద్రాలు వాతావరణశాఖ అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లోపం కారణంగా వాటిల్లో ఉన్న చిప్స్ దొంగలెత్తుకెళ్లటంతో పాటు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో వాతావరణంలో వచ్చే మార్పులను లెక్కించే అవకాశం లేకుండా పోయింది. అధికారులు చర్యలు తీసుకొని వాతావరణంలో నెలకొంటున్న మార్పులు, కురుస్తున్న వర్షాలను సక్రమంగా లెక్కించి తమకు ఉపయోగపడేలా సమాచారం అందించాలని మండలంలోని వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు.

18న మాన్యం భూముల కౌలుకు వేలాలు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీచెన్నకేశవ, ఆంజనేయ, వేణుగోపాల స్వామి ఆలయాలకు సంబంధించిన భూములను ఈ నెల 18న ఉదయం 11 గంటలకు కౌలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ. 2వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. దేవస్థానమునకు పాత బకాయిలు ఉన్నవారు, దావాలు వేసిన వారు, అన్య మతస్తులు వేలంలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. వేలం పాట భూమిని 3 సంవత్సరాలు 2024–2025 నుంచి 2026–2027 వరకు వేలం వేయనున్నట్లు తెలిపారు.

17న పగిడ్యాలలో..

పగిడ్యాల: ఈనెల 17న స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయ ఆవరణలో ఆంజనేయస్వామి, వీరభద్రస్వామి, చెన్నకేశవస్వామి దేవుని మాన్యం భూముల కౌలు వేలాలు నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి రామలింగారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాటల్లో పాల్గొనే రైతులు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో కౌలు సొమ్ము చెల్లించని బకాయిదారులు, దేవస్థానంపై దావాలు వేసిన వారు పాటలో పాల్గొనేందుకు అర్హులు కాదన్నారు. వేలం దక్కించుకున్న వారు వెంటనే కౌలు సొమ్ము మొత్తాన్ని చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. దేవదాయ శాఖ నిబంధనలకు లోబడే పాటలో పాల్గొనాలని ఆయన వెల్లడి చేశారు. వేలాల్లో హిందు మతస్తులు మాత్రమే పాల్గొనాలని అన్యమతస్తులు పాల్గొనరాదని తెలిపారు.

సూర్యనారాయణుడికి విశేష పూజలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం వృషభ సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు పురుష సూక్త విధానంతో అరుణ పారాయణం, సుగంధద్రవ్య జలాభిషేకం, క్షీరాభిషేకం, విశేషాలంకరణ, అర్చన, నక్షత్ర మహా మంగళహారతి, అరుణ, మహాసౌర హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ప్రకృతి వరప్రసాదం.. తాటి ముంజలు

నందికొట్కూరు: వేసవి తాపాన్ని తీర్చే తాటి ముంజలు అందుబాటులోకి వచ్చాయి. ప్రకాశం జిల్లా మార్కాపురం ఏరియా నుంచి తీసుకొచ్చి నందికొట్కూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన పోసి విక్రయిస్తున్నారు. తియ్యగా నోట్లో వేసుకుంటే కరిగి పోయేలా ఉండే వీటి లోపల భాగం నీరుగా ఉంటుంది. ఈ ముంజలు శరీరానికి కలిగించే చలువ వల్ల ఐస్ ఆఫిల్ అని కూడా అంటారు. అప్పటికప్పుడే తాటి కాయల్లో నుంచి తీసి డజను రూ.200ల వరకు విక్రయిస్తున్నారు. పట్టణంలోని పెంట్రోల్ బంకు, పగిడ్యాల రోడ్డులో పాత బస్టాండ్, అల్లూరు రోడ్డులో, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో ముంజళ్లను విక్రయిస్తున్నారు.



తాటి ముంజలను అమ్ముతున్న వ్యాపారి

తాటి ముంజల్ ఉపయోగాలు

- వేసవిలో వడదెబ్బ తగలకుండా చలువ చేస్తాయి.
- నీటి శాతం అధికంగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్, చెక్కరలను సమతల్యం చేస్తాయి.
- జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం , ఎసీడీటీ లాంటి ఆరోగ్య సమస్యలన్నీ దూరం చేస్తాయి.
- బరువును తగ్గిస్తాయి. తాటి ముంజలలో శరీరానికి కావాల్సిన విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరుండటం వల్ల శరీర బరువు తగ్గించడానికి ముంజలు ఎంతోగానో ఉపయోగపడతాయి.
- తాటి ముంజలు కాలేయ సంబంధ సమస్యలను తగ్గిస్తాయి. ఈ కాయలో అధిక మొత్తంలో ఉండే పొటాషియం మన శరీరంలో ఉండే విష పదార్థాలను తొలగిస్తుంది.
- అధికం ఎండ వేడిమికి ఒక్కసారి వాంతులవుతుంటాయి. ముంజలను తినడం వల్ల వాంతులను అరికట్టవచ్చు.
- కేన్సర్ల దూరం చేస్తాయి. తాటి ముంజలు వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ కేన్సర్ కణాలను అభివృద్ధి చేసే పైటో కెమికల్స్‌ను నిర్మూలిస్తాయి.
- శరీరంలో కోల్పోయిన నీటిని ముంజల ద్వారా పొందవచ్చు. తద్వారా అలసటను దూరమవుతుంది.
- తాటి ముంజలను పొట్టు తీయకుండా తినాలి. పై పొరలో ఏన్నో రకాల పోషక విలువలు ఉంటాయి. పొట్టు వల్ల శరీరానికి ఎక్కువ చలువు చేస్తుంది.

ఒక రోజుకు రూ. వెయ్యి ఆదాయం వస్తోంది



ఒక రోజుకు 360 ముంజలు అమ్మితే ఆదాయం రూ.వెయ్యి వస్తుంది. తాటి చెట్లను 60 నుంచి 100 వరకు రూ. 50 వేలు వెచ్చించి కొనుగోలు చేస్తాం. తాటి చెట్ల మీద నుంచి గెలల్ని నరికి వాహనాల ద్వారా నందికొట్కూరు తీసుకొచ్చి అమ్ముతాం. వేసవిలో దాహాన్ని తీర్చుకునేందుకు చలువ చేసే ముంజళ్లను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మా రవాణా ఖర్చులు పోను రోజుకు కూలీ గిట్టుబాటు అవుతుంది. సీజన్‌లో వ్యాపారం మాకు బాగానే ఉంది.

– ఆవులయ్య, వ్యాపారి, మార్కాపురం

ఓటింగ్‌లో బండిఆత్మకూరు టాప్

- మండలంలో 89.21 శాతం పోలింగ్
- మహిళల ఓట్లే అధికం



సంతజూటూరులో ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు(ఫైల్)

మహానంది: సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌లో నియోజకవర్గంలో బండిఆత్మకూరు మండలంలో టాప్‌లో నిలిచింది. మండలంలో మొత్తం 37,974 మంది ఓటర్లు ఉండగా 33,877 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషుల ఓటర్లు 16,912 మంది, మహిళలు 16,961 మంది పోలింగ్‌లో పాల్గొనగా పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో ఉన్నారు. బండిఆత్మకూరు మండలం ఎప్పుడూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కంచుకోటగా ఉంది. ఆయన ఏపార్టీలో ఉన్నా మెజారిటీ వస్తుంది. గత ఎన్నికల్లో సుమారు 9,000ఓట్ల మెజారిటీ లభించింది. ఈ ఏడాది సైతం వైఎస్సార్‌సీపీకి మెజారిటీ వస్తుందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల వారీగా పోలైన ఓట్ల వివరాలు

గ్రామం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
బోధనం	972	899
పరమటూరు	1,176	1,061
సంతజూటూరు	1,943	1,683
పెద్దదేవలాపురం	1,884	1,700
నారాయణాపురం	1,614	1,416
చిన్నదేవలాపురం	1,830	1,779
లింగాపురం	2,266	1,977
జీసీ పాలెం	876	827
శింగవరం	1,330	1,220
రామాపురం	684	631
బండిఆత్మకూరు	4,967	4,264
యర్రగుంట్ల	2,166	1,978
కాకనూరు	1,279	1,153
పార్నపల్లె	2,851	2,516
ఈర్నపాడు	3,017	2,726
సోమయాజులపల్లె	965	886
వెంగళరెడ్డిపేట	789	721
కడమలకాల్వ	2,109	1,950
ఏ.కోడూరు	2,812	2,545
బి.కోడూరు	1,997	1,773
ఎరుకల కాలనీ	447	372

ఎన్నికల నిర్వహణలో మార్పులు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల నిర్వహణలో మార్పులు అవసరమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఇచ్చే భత్యంలో తేడాలు ఎందుకు ఉన్నాయో అర్థం కావడం లేదని, తెలంగాణలో ఒక విధంగా, ఇక్కడ మరో విధంగా ఇస్తున్నారన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని బనగానపల్లె, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పీఓ, ఏపీఓలకు వివిధ రకాలుగా ఎన్నికల భత్యం చెల్లించారన్నారు. ఆడిట్ లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. రాష్ట్రమంతా ఒకే విధమైన పాలసీ తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రామ్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, మధు సూధన్, సోమయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

9 మందిపై కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తులలో బుధవారం హరి అనే వ్యక్తిపై దాడి చేసినందుకు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున ఎల్లావత్తుల గ్రామానికి చెందిన తుమ్మల కిట్టు అనే వ్యక్తిని ఓటు వేసేందుకు క్యూ లైన్లో వెళ్లాలని హరి చెప్పాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే అక్కడున్నవారు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. బుధవారం వారిద్దరి మధ్య మళ్లీ మాటామాట పెరిగి కిట్టుతో పాటు మరో 8 మంది కలిసి హరిపై దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

తాటిపాడులో ఉపాధి పనులకు అనుమతి లేదు

జూపాడుబంగ్లా: తాటిపాడు గ్రామంలో ఉపాధి పనుల నిర్వహణకు అనుమతులు లేవని ఏపీఓ గౌరీబాయి తెలిపారు. 'తాటిపాడులో ఉపాధి పనులు కల్పించండి' అనేశీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఆమె మాట్లాడుతూ తాటిపాడు గ్రామంలో ఉపాధి పనుల నిర్వహణకు సంబంధించిన తీర్మానం ఆలస్యం కావడంతో దాన్ని పీఓ ద్వారా పీడీకి పంపించామన్నారు. ఆలోగా ఎన్నికల కోడ్ అమలు కావడంతో గ్రామంలో ఉపాధి పనుల నిర్వహణకు అనుమతులు లభించలేదన్నారు. దీంతో తాటిపాడు గ్రామంలో ఉపాధి పనులు కల్పించలేకపోతున్నామని చెప్పారు. మండలంలోని మిగిలిన 11 గ్రామపంచాయతీల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. జూన్ 4న ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తాటిపాడులో ఉపాధి పనులు కల్పించే అవకాశం ఉందన్నారు.

నక్కి రామన్నకు నివాళి

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నక్కి రామన్న 34వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ పేదలకు భూములు పంపిణీ చేసేందుకు పోరాటం చేసిన వ్యక్తి రామన్న అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, బాబాఫక్రుద్దీన్, సుంకయ్య, రాముడు, ప్రభాకర్, శ్రీనివాసులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేలమఠంలో ఆరాధనోత్సవాలు

బనగానపల్లె : బనగానపల్లె సమీపంలోని వీరప్పయ్యస్వామి నేలమఠంలో ఈ నెల 17 నుంచి 19వరకు 331వ ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బ్రహ్మానందరెడి తెలిపారు. 17న ఉదయం 5 గంటలకు నాగస్వరం, సుప్రభాతం, పంచామృతాభిషేక అష్టోత్తర శాతనామ పూజలు, మాత వీరకాళికాంభదేవికి కుంకుమార్చన, 10 గంటలకు గరిమిరెడ్డి అచ్చమాంబ ఇంటి నుంచి స్వామివారి 331వ సంవత్సరపు జీవాసమాది జ్ఞాపిక పతాకం తీసుకొస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు మహాప్రసాద వితరణ, సాయంత్రం 7 గంటలకు పల్లకీ సేవా నిర్వహిస్తారు. 18న స్వామివారికి పంచామృతాభిషేక అష్టోత్తర శాతనామ పూజలు, వీరకాళికాంభదేవి అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి 7 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, 19న మహానివేధన తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈఓ వివరించారు.

ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పది, ఇంటర్ టాపర్లకు ప్రభుత్వం నజరానా
- పాఠశాల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సన్మానం
- ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖాధికారులు

నంద్యాల (న్యూటౌన్): ప్రభుత్వ బడుల్లో చదివి పదో తరగతి పరీక్షల్లోను, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరిట సన్మానాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు రెండో ఏడాది కూడా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అధికారులు విద్యార్థుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. పాఠశాల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ఇలా నాలుగు స్థాయిలుగా జగనన్న ఆణిముత్యాల సన్మానాలతో పాటు నగదు పారితోషికం అందజేయనున్నారు .

మొదటి మూడు స్థానాలకు..

జిల్లా విద్యాశాల అధికారులు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారి జాబితాలను సిద్ధం చేస్తున్నారు. వారికి బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందించనున్నారు. అలాగే ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సహించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి గతేడాదే శ్రీకారం చుట్టారు. ఈ తరహా విధానాలు.. విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని, పోటీతత్వాన్ని తీసుకొస్తాయనేది ప్రభుత్వ ఉద్దేశం. సీఎం నిర్ణయంపై అ ఉపాధ్యాయ వర్గాలు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



స్టడీ అవర్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

మందుల విరాళం

నంద్యాల టౌన్: పట్టణంలోని గిరినాథ్ సెంటర్ ప్రాంతంలో తీవ్ర అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న చాకలి లక్ష్మీనారాయణకు రెండు వేల రూపాయలు విలువైన మందులు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బోరెడ్డి శ్రీకాంత్ రెడ్డి విరాళంగా అందజేసినట్లు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ మారుతి తెలిపారు. చికిత్సకు తగిన నగదు లేక ఇబ్బంది పడుతున్న లక్ష్మీనారాయణ పరిస్థితి గురించి రెడ్ క్రాస్ సిబ్బంది వివరించగా వైద్యుడు అతనికి మందులు ఉచితంగా అందజేశారన్నారు.